## డిజిట్-మెరిట్



రూ.1,262 కోట్లు

ప్రభుత్వ దవాఖానల్లో కాన్పు అయిన తల్లులకు 'కేసీఆర్ కిట్' పేరిట అందించిన సాయం.


## థర్డ్ అంపైర్



తెలంగాణలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం కేసీఆర్ చొరవ అభినందనీయం. దళితుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలూ పాటుపడుతున్నది.

■ అరుణ్ హల్దార్,
షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ గౌరవ అధ్యక్షుడు

## థౌజండ్ వాలా..




కౌంట్ డౌన్ 16

హైదరాబాద్ | మంగళవారం 14 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com



## పెట్టుబడులకు స్వర్గధామం

గతంలో పారిశ్రామికంగా తెలంగాణలో ఒక వెలితి ఉండేది. ఇప్పుడు తెలంగాణ బిడ్డలు దేశానికి అవసరమయ్యే రైళ్లు తయారు చేసే రోజులు వచ్చాయి. ఏ రాష్ట్రమైనా అభ్యుదయ పథంలో రాణించాలంటే.. దానికి సంబంధించిన అనుకూల పరిస్థితులు కల్పించాలి. పెట్టుబడులను ఆకర్షించేలా ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా టీఎస్-ఐపాస్ తీసుకొచ్చినం. ఇది దేశానికే మార్గదర్శకంగా నిలిచింది. దాదాపు ఎనభై దేశాల పారిశ్రామిక విధానాలను పరిశీలించి టీఎస్- ఐపాస్‌కు రూపకల్పన చేశాం. దాని ఫలితంగా తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామంగా నిలుస్తున్నది.

■ కేసీఆర్



దండుమల్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్

మీలా జయదేవ్

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

- నిరంతర విద్యుత్తుతో పారిశ్రామిక రంగానికి ఊతం
- పెట్టుబడుల స్వర్గధామం తెలంగాణ
- టీఎస్ ఐ-పాస్ విప్లవాత్మక చట్టం
- ఉమ్మడి రాష్ట్రంలో భారీగా మూతపడ్డ పరిశ్రమలు
- 2010-14 మధ్య 50 శాతం స్టీల్ పరిశ్రమలకు తాళం
- కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ
- 'నమస్తే'తో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు మీలా జయదేవ్

# పరిశ్రమ పరుగు ఆగొద్దు!

కరెంట్ కోతలు, పవర్ హాలిడేలు, లే ఆఫ్‌లు, పరిశ్రమల మూత, పనులు దొరక్క పస్తులు. ఆకలి చావులు.

• ఇది ఉమ్మడి రాష్ట్రంలో దుస్థితి.

నిరంతర వెలుగులు, చేతినిండా పని, వెల్లువలా పెట్టుబడులు, ఉపాధికి నిలయంగా మారిన రాష్ట్రం.

• ఇది కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాధించిన విజయం.

**'తెలంగాణలో పారిశ్రామిక రంగం పరుగులు పెడుతున్నది. కేంద్రం సహాయ నిరాకరణ, రెండేండ్ల కాలాన్ని కరోనా మింగేసినా.. రాష్ట్రంలో ఇండస్ట్రీల దూకుడు తగ్గలేదు. రాష్ట్ర ప్రభుత్వ అనుకూల విధానాలు, మంత్రి కేటీఆర్ డైనమిక్ లీడర్‌షిప్‌తో తెలంగాణ పెట్టుబడుల గమ్యస్థానంగా మారింది. టీఎస్ ఐ-పాస్ చట్టం రాష్ట్రాన్ని పెట్టుబడులకు కేంద్రంగా మార్చింది' అని అంటున్నారు ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షుడు మీలా జయదేవ్. తెలంగాణలో పారిశ్రామిక రంగం సాధించిన ప్రగతి, భవిష్యత్తు అవకాశాలపై ఆయన 'నమస్తే తెలంగాణ'తో ముచ్చటించారు.**

**తెలంగాణ ఏర్పడక ముందు, రాష్ట్రం ఏర్పడ్డాక పారిశ్రామిక రంగంలో వచ్చిన మార్పులను ఏ విధంగా చూస్తారు?**

తెలంగాణ ఏర్పాటుకు ముందు పారిశ్రామికరంగం మందగమనంతో సాగింది. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టింది. ఫలితంగా డబుల్ డిజిట్ వృద్ధిని నమోదు చేయడమే కాకుండా భారీగా పెట్టుబడులను రాబట్టింది. దీంతో పెద్ద ఎత్తున ఉద్యోగాల సృష్టి జరిగింది. సులభతర విధానాలు అమలు చేయడం ద్వారా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ర్యాంకింగ్స్‌లో 2016 నుంచి వరుసగా తెలంగాణ మొదటి మూడు స్థానాల్లో చోటు దక్కించుకుంటున్నది. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు కోసం నానా ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ ఏర్పాటుతో పారిశ్రామికరంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నది.

**ప్రభుత్వం నుంచి పారిశ్రామిక రంగానికి ఏ విధమైన సహకారం, ప్రోత్సాహకాలు అందుతున్నాయి?**

పారిశ్రామికరంగానికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ మద్దతు అందిస్తున్నది. ముఖ్యంగా టీఎస్ ఐ-పాస్ ద్వారా నిర్ణీత గడువులోగా అన్ని అనుమతులు మంజూరవుతున్నాయి. దీనికితోడు ప్రభుత్వ స్నేహపూర్వక విధానాలు పెట్టుబడిదారులను మరింత ఆకర్షించేలా చేస్తున్నాయి. విద్యుత్, నీటి సరఫరా నిరంతరాయంగా సాగుతున్నది. మౌలిక సదుపాయాలకు కొదవలేదు. దీంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి కేటీఆర్ చొరవతో తెలంగాణ పేరు ప్రఖ్యాతులు ఖండాంతరాలకు విస్తరించింది. రాష్ట్ర ప్రభుత్వ వృద్ధిరేటు ఏటా పెరుగుతుండటం నూతన పెట్టుబడులకు కలిసొచ్చే అంశంగా చెప్పవచ్చు.

**ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం నుంచి లభిస్తున్న సహకారం ఎలా ఉందంటారు?**

తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్రం సరిపడా నిధులు విడుదల చేయడం లేదనే విమర్శలున్నాయి. ఉదాహరణకు 2011లో మంజూరైన నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్)కు కేంద్రం నిధులు మంజూరు చేయకపోవడం వల్ల అది ముందుకు సాగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడి మేరకే వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌కు మెగా ప్రాజెక్టు హోదా దక్కింది. రాష్ట్రానికి జాతీయ ప్రాజెక్టులేవీ పెద్దగా రావడం లేదు. నిమ్జ్‌కు నిధులు మంజూరు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**గడిచిన దశాబ్దిలో పారిశ్రామికరంగానికి ఒనగూడిన ప్రయోజనాల్లో ప్రధానమైనది ఏదని మీ భావన?**

నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా తెలంగాణ ప్రభుత్వం సాధించిన గొప్ప విజయంగా నేను అభివర్ణిస్తాను. కరెంటు ఉంటేనే పరిశ్రమలు నిలబడతాయి. ఉత్పాదక శక్తి పెరుగుతుంది. ఉపాధి కల్పన మెరుగవుతుంది. తెలంగాణ ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ రంగంపై దృష్టి సారించారు. వ్యవసాయం నుంచి పరిశ్రమల దాకా అన్ని రంగాలకూ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నారు. అయితే ఫ్యూయిల్ సర్‌ఛార్జ్ అడ్జెస్ట్‌మెంట్ (ఎఫ్ఎస్‌ఏ) మాత్రం కొంత భారంగా మారింది. దీనిని వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా ఎఫ్ఎస్‌ఏను పరిష్కరించాలని కోరుతున్నాం. ఇక గడచిన పదేండ్లలో కరెంటు లేక మూతపడిన పరిశ్రమ ఒక్కటీ లేదంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి రాష్ట్రంలో పవర్ హాలిడేలు నిత్యకృత్యంగా ఉండేవి. సరైన విద్యుత్ సరఫరా లేక పారిశ్రామికరంగం కుంటుపడింది. 50 శాతం స్టీలు పరిశ్రమలు, 40 శాతం ఎంఎస్ఎంఈలు, ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలు మూతపడ్డాయి.

> దేశంలో ఎక్కడాలేని పారిశ్రామిక అనుకూల విధానాలు తెలంగాణ ప్రత్యేకత. ఔషధ రంగానికి హైదరాబాద్ కేరాఫ్‌గా నిలుస్తున్నది. ఐటీలో అప్రతిహతంగా దూసుకుపోతున్నది. ఎలక్ట్రానిక్స్ రంగంలోనూ శరవేగంగా వృద్ధి చెందుతున్నది. ప్రభుత్వం ఏరోస్పేస్, డిఫెన్స్, ఆహార శుద్ధి రంగాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. బీఆర్ఎస్ గవర్నమెంట్ పాలసీల కారణంగా ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు మరింత పెరుగుతున్నాయి.

**తెలంగాణలో సరుకుల రవాణాకు ఉన్న అవకాశాలు ఏమిటి? ఇంకా ఎటువంటి చర్యలు అవసరం?**

రాష్ట్రంలో సరుకుల రవాణాకు మెరుగైన అవకాశాలు ఉన్నాయి. వాయు, రోడ్డు, రైలు మార్గాలు చక్కగా అందుబాటులో ఉన్నాయి. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి సరుకు రవాణా చేసేందుకు డ్రైపోర్ట్- ఇన్‌లాండ్ కంటెయినర్ డిపో (ఐసీడీ)లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నది. కంటెయినర్ల ద్వారా సీపోర్ట్ వరకు సులభంగా సరుకుల రవాణా చేసుకునేందుకు వీలు కల్పించాలి. రవాణా రంగాన్ని మరింత మెరుగుపర్చాల్సి ఉంది. రవాణా ఖర్చులు తగ్గితే ఉత్పాదక వ్యయంతోపాటు వినియోగదారులపైన భారమూ తగ్గుతుంది.

**ఈ రాష్ట్రంలో ఏఏ రంగాలు ఎక్కువగా వృద్ధి సాధిస్తున్నాయని మీ అంచనా?**

రాష్ట్ర ప్రభుత్వ అనుకూల విధానాల వల్ల అనేక రంగాల్లో పురోగతి స్పష్టంగా కనిపిస్తున్నది. ఐటీ రంగం గణనీయంగా వృద్ధి సాధించింది. 2015లో రూ.57 వేల కోట్ల ఎగుమతులు జరుగగా, 2022-23కు రూ.2.41 లక్షల కోట్లకు చేరుకున్నాయి. దేశవ్యాప్తంగా 44 శాతం ఉద్యోగాలు ఐటీతో పాటు దాని అనుబంధ రంగాలకు సంబంధించినవే. రాష్ట్రవ్యాప్తంగా 100 వరకు ఫుడ్‌పార్క్‌లు ఏర్పాటవుతున్నాయి. ఔషధ, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఇప్పటివరకు రూ.29,000 కోట్ల పెట్టుబడులు రాగా, 4.5 లక్షల ఉద్యోగాలు లభించాయి. హైదరాబాద్ గ్లోబల్ వ్యాక్సిన్ హబ్‌గా ఎదిగింది. టాప్-10 ఔషధ కంపెనీలు సహా వెయ్యికిపైగా లైఫ్‌సైన్సెస్ రంగ కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి.



**తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన టీఎస్ ఐ-పాస్ ఇండస్ట్రీ పాలసీకి ఎలా దోహదం చేసిందంటారు?**

> భౌగోళికంగా, వాతావరణ పరంగా తెలంగాణకు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. వరదలు, భూకంపాలకు అవకాశాలు చాలా తక్కువ. టీఎస్ ఐ-పాస్ చట్టం, ప్రభుత్వ స్నేహపూర్వక విధానాలు, రాయితీలు ఇవన్నీ పెట్టుబడుల ఆకర్షణకు దోహదం చేసే అంశాలే. టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తుండటంతో ఇండస్ట్రియల్ పార్క్‌లకు పరిశ్రమలు తరలివస్తున్నాయి.

ఇతర రాష్ట్రాల్లో కూడా పరిశ్రమల అనుమతులకు సింగిల్ విండో విధానం ఉన్నప్పటికీ టీఎస్ ఐ-పాస్ అంత కచ్చితంగా అమలు కావడంలేదు. అధికారులను బాధ్యులను చేయడం టీఎస్ ఐ-పాస్ ప్రత్యేకత. జాప్యానికి కారణమయ్యే అధికారికి జరిమానా విధించడం దేశంలో ఎక్కడా లేదు. నిర్ణీత గడువులోగా అనుమతులు జారీ చేసేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడం వల్ల జాప్యానికి అవకాశం లేకుండా పోయింది. భారీ పరిశ్రమలకు సీఎంవో స్థాయిలోనే నిర్ణయాలు జరుగుతున్నందున భారీగా పెట్టుబడులు వస్తున్నాయి.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పరిశ్రమలరంగం ఏం ఆశిస్తున్నది?**

దేశ ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలది కీలకపాత్ర. ఇండస్ట్రియల్ కారిడార్లను అభివృద్ధి చేయడంతోపాటు ప్రభుత్వరంగంలో పరిశోధన సంస్థలను కేంద్రం ఏర్పాటు చేయాలి. జాతీయ రహదారులను మరింత అభివృద్ధి చేసి రోడ్డు, రైలు కనెక్టివిటీని పెంచాలి. రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ధరకు భూములు కేటాయించడంతోపాటు ప్రోత్సాహకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి. పన్నుల భారాన్ని తగ్గిస్తే పారిశ్రామికరంగం మరింత బలోపేతం అవుతుంది. ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లో కామన్ ఫెసిలిటీ సెంటర్లు, టెస్టింగ్, గ్రేడింగ్ సౌకర్యాలను ఏర్పాటుచేయాలి.

... కిశోర్ శుక్ల

## ఎటమటం!




## డబుల్ ఇంజిన్ అంటే ఇద్దరు కృష్ణులా?

బండి సంజయ్‌ని సీఎం అభ్యర్థిగా ఖరారు చేయడం వల్లనే ఆయన్ని పార్టీ అధ్యక్షుడి బాధ్యతల నుంచి తప్పించి కిషన్‌రెడ్డికి అప్పగించినట్టు ఆ పార్టీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు ఇటీవల కొత్త విషయాన్ని బయటపెట్టారు. ఒకవైపు బీసీని సీఎం చేస్తామని చెబుతూనే మరోవైపు అధ్యక్షుడిగా ఉన్న బీసీని తొలగిస్తారా?... అని పెద్ద ఎత్తున వెల్లువెత్తిన విమర్శలకు పార్టీ తరఫున ఆయన వివరణ ఇచ్చారు. కానీ మురళీధర్‌రావు చెప్పింది తప్పు, సీఎం అభ్యర్థి బండి కాదు...తాను అంటూ ఆ పార్టీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ఖండించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా కుల సంఘాల భేటీలో ఆ విషయం వెల్లడించారని ఈటల గుర్తు చేశారు. బండి సంజయ్ ఏమో సీఎం అభ్యర్థిగా తన పేరు ప్రచారం చేయడం వల్లనే ఉన్న పోస్టు ఊడబెరికారని వాపోయారు. బీజేపీ విజయం సాధిస్తే సుస్థిర ప్రభుత్వం అందిస్తామని ఒకవైపు చెబుతూ మరోవైపు ఈ ఇద్దరు సీఎం అభ్యర్థుల గోల ఏంటీ? ఒక పార్టీలో ఈ డబుల్ స్టాండర్డ్ ఏంటనే చర్చ జరుగుతున్నది. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఒకే టర్న్‌లో ఇద్దర్ని సీఎంలను చేయడమా?... అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కర్ణాటకలో యెడియూరప్ప, బస్వరాజ్ బొమ్మై ఇద్దర్నీ సీఎంలను చేసిన విషయం తెలిసిందే. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఇంకేదో అనుకున్నాం...ఇదా? అని జనం నోరెళ్లబెడుతున్నారు.

• వెల్జాల

## ఖుల్లం ఖుల్లా



*మన్ కీ బాత్ చాలోయి*
*జన్ కీ బాత్ వినవోయి*
*రొమ్ము విరవడం కాదోయి*
*రూపాయి విలువ పెంచోయి*

*అంతన్నారు.. ఇంతన్నారు..*
*ఐదు హామీలు తుంగలో తొక్కారు*
*ఇక్కడికొచ్చి ఆరిస్తామంటున్నారు*
*జనం మాత్రం ఉతికి ఆరేస్తామంటున్నారు!*

... కణ్వస

## పెద్దల మాట



## కాంగ్రెస్ గింతగూడా చెయ్యలే!

'పెద్దల మాట సద్దన్నం మూట' అంటారు. 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో అరిగోసలు పడ్డ రైతన్నలు తెలంగాణలో ఎవుసం ఎలా ఉందో చర్చించుకున్నారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన అన్నదాతల అసలు ముచ్చట మీరూ చదవండి..

**మోత్కాని వెంకటయ్య:** మల్లయ్య ఎట్టుంది ఎవుసం!

**పుల్ల మల్లయ్య:** బంధం చెరువునిండా నీళ్లుండగా ఎవుసం ఎటుపోతది. రెండోపంటకు గిన మస్తు నీళ్లున్నయ్.

**గంగసాని రాజిరెడ్డి:** ఇంతకుముందు చెరువులో నీళ్లసుక్కుండేది కాదు. ఎండకాల వొచ్చిందంటే గోజలకు కూడా శానతిప్పలయ్యేది. గిప్పుడు బోర్లళ్ల నీళ్ల ఊటలుకూడా పెరిగినయ్.

**పడిగె మహంకాళి:** చెరువునిండానీళ్లు, ఇంటింటికీ తాగేనీళ్లు, రైతుబంధు గివన్నీ కేసీఆర్ చేసుట్లనే అయినయ్.

**మోత్కాని వెంకటయ్య:** కేసీఆర్ చేసిందాంట్ల కాంగ్రెసోళ్లు బుడ్డపైస మందం చేయలే.

**గంగసాని రాజిరెడ్డి:** కేసీఆర్ మీద ఆడొకడు, ఈడొకడు నిలవడ్డరట కదా!

**మోత్కాని వెంకటయ్య:** ఎంత మంది నిలవడ్తె ఏందే! ఊరందరికి మేలు చేసిన కేసీఆర్‌ను ఎట్ల మరుస్తం! రాముడెవ్వడో.. రాచ్చసుడెవ్వడో మనకి తెల్వదా!!

• రంగు శ్రీనివాస్